వేట

అడవిలోంచి జీపు పాములాగా పరుగెడుతున్నది సన్నటి కాలిబాట వెంట. పైన ఆకాశంలో చంద్రుడు వెన్నెల విరజిమ్ముతున్నాడు. చంద్రం మనస్సు మరింత ఉల్లాసంగా వుంది. సన్నటి గాలికి చెట్లఆకులు సన్నగా తల వూపుతున్నాయి. వెన్నెల జల్లులు సందుల్నించి నేలమీద పడి అందమయిన తివాచీమీద డిజైన్లలా వున్నాయి. దూరంగా పర్వత లోయల్లోనించి వచ్చే అస్పష్టధ్వనులు మినహా అంతా నిశ్శబ్దంగా వుంది. పైన 'కాన్వాసు' గుడ్డలోంచి దూసుకుని వచ్చిన వెన్నెల విరుపులు తార కపోలాలమీద ప్రతిఫలించి తిరిగి వెనక్కి పోతున్నాయి.

జీపు యేటి గట్టుదిగి కాలిదారి వెంబడి లోయలోనికి దిగింది. "వేదం కొంచెం తగ్గించి ఒకలైటు తీసేయండి. ఇక్కణ్నించి కొంచెం జాగ్రత్తగా వుండాలి" కాలి బాటని శ్రద్ధగా పరిశీలిస్తూ అంది తార. ఒకవైపు లైట్లు తీసేశాడు చంద్రం. "నీ మాటల్నిబట్టి నువ్వు ఇదివరకు చాలాసార్లు చూసినట్లు

న్నావు లేటని." నవ్వాడు చంద్రం "వేట అంటే వారికి మరీ ఇష్టం. నాకు పెద్ద యిష్ట లేదుగాని ఆనందించగలను." తార పెద్దకళ్ళు అందంగా మెరిశాయి. "డిన్నర్ తరవాత వేటవుంది. తప్పకుండా రమ్మన్నాడు నాగభూషణం. సరేనని ఒప్పుకున్నాను." చంద్రం నవ్వాడు. రోడ్డుమీద నిద్రపోతున్న చెవులపిల్లలు జీపు ధ్వనికి బాటకి అటూ యిటూ పరుగులు తీస్తున్నాయి. జీపు కొండఎక్కుతుండగా ఒకచోట్ల కోడె త్రాచు ఒకటి అకస్మాత్తుగా బుసకొట్టి నిలబడి తలపైకెత్తింది జీపు ఆపాడు చంద్రం.

పాము తలవంచి జరజరా ప్రక్కకి వెళ్ళిపోయింది. జీపు కదిలింది.

మరో పావుగంటకి జీపు గమ్యస్థానం చేరింది.

*　　　*　　　*

జీపుధ్వనికి బంగళాలోనించి యిద్దరు నౌకర్లు పరుగెత్తుకొని వచ్చారు. వెనకనుంచి పళ్ళబుట్టలూ, సీసాలూ తీసి లోపలికి చేరవేశాడు. చంద్రం తను ముందుదిగి తారకి చేయి అందించాడు. ఇద్దరూ నడుచుకుంటూ వెళ్ళారు. వరండాలో సోఫాలో నాగభూషణం సిగరెట్టు కాల్చుకుంటూ ఆకాశం వంక చూస్తున్నాడు.

"గుడ్! సమయానికే వచ్చారు. త్రోవలో ఎక్కడా యిబ్బంది లేదుగదా!" నవ్వుతూ యిద్దర్నీ పరామర్శించాడు నాగభూషణం.

"ఇంతవరకూ యేమీ క్రూర మృగాలు మా జోలికి రాలేదు" నవ్వాడు చంద్రం.

"ఇంకా భోజనం సిద్ధం కాలేదు. కాస్సేపు చదరంగం ఆడుదామా అని?" బల్ల సర్దాడు నాగభూషణం. తారలోపలికి వెళ్ళిపోయింది. ఆటలో చంద్రాన్ని తీసికట్టు చేయాలని శత విధాల యెత్తులు వేశాడు నాగభూషణం కాని ఆడిననాలుగు పందేల్లోనూ తనే తీసి కట్టయ్యాడు. విసిగి అవమాని సిగరెట్లు కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకున్నారు కాస్సేపు.

టైము పదింపావుయింది. వంటయిందని కబురువచ్చింది. ఇద్దరూ లేచి వెళ్ళారు. అప్పటికి తార మొహం కడుక్కుని డ్రెస్ మార్చుకుని వచ్చింది. డైనింగ్ టేబులుమీద తెల్లటి గుడ్డ పరిచాడు. అందమయిన "చైనా క్రోకరి" వెన్నెల్లో మెరుస్తోంది అందంగా అమర్చబడి.

"మీకు వేట యిదే ప్రథమం అనుకుంటాను." అన్నాడు నాగభూషణం.

"అవును. ఇదివరకు ఎప్పుడూ చూడలేదు. ఆడలేదు కూడా." నవ్వాడు చంద్రం.

"నేను నమ్మను" అంది తార వంకరగా నవ్వుతూ. భోజనం అవుతున్నంతసేపూ యేదో చెబుతూనే ఉన్నాడు నాగభూషణం. భోజనంముగించి పానీయాలు పుచ్చుకున్నారు. నాగభూషణం బాగా తాగాడు.

"ఇక్కడికి నాలుగు మైళ్ళ దూరంలో టైగర్ వాలీ ఉంది. మంచె అదీ ముందు సిద్ధం చేరుకుని ఈ పాటికల్లా మనం అక్కడికి చేరుకునివుంటే ఈ రాత్రి తప్పకుండా యేదో ఒకటి పడేదే ననుకోండి. అయినా మన డైరెక్టు ఫైట్. పడితే పడుతుంది. లేకపోతే కనీసం రాత్రివేళ "వైల్డు లైఫ్"

ఎలా వుంటుందో చూసిరావచ్చు. మీ దగ్గర బేటరీలైటు వుందిగా?" నాగభూషణం చెప్పుకుపోతున్నాడు.

"ఒకసారి ఏమయిందో తెలుసా. జీపుమీద నేనూ నా మిత్రుడూ అర్థరాత్రి పనిమీద వెడుతున్నాము అడవిలోంచి. చాలా-చోట్ల బాట మలుపులు తిరిగివుంది. అక్కడికీ జీపు మెల్లిగానే పోస్తున్నాము. నేను ఏదో ఆలోచిస్తున్నాను. ఇంతలో జీపు ఆగిపోయింది. నా వీపు తట్టి నా మిత్రుడు వణికిపోతున్నాడు. ఎదురుగా "హెడ్ లైట్" కాంతిలో బాటకి అడ్డంగా చిరుత పులులు నుంచుని వున్నాయి. రెండూ జీపువంకే తీక్షణంగా చూస్తున్నాయి. తుపాకీ ఎప్పుడూ నాతోనే ఉంటుంది, ఎక్కడికెళ్ళినా! అది మీకు తెలుసు గదా!

"నేను మెల్లిగా తుపాకీతీసి గురిచూసి కాల్చాను. గురితప్పి ఒకదాని వెనుక కాలికి తగిలింది. భీకరంగా అరుస్తూరోడ్డు ప్రక్కన పడిపోయింది. మళ్ళీ కాల్చటానికి ప్రయత్నించాను. ఆశ్చర్యం! తూటాలు అయిపోయాయి. అశ్రద్ధ వలన చూడలేదు. సహజంగా దెబ్బతిన్న ఆ చిరుత మా పైకి లంఘించి ఉండాలిసి వుంది. కాని మా అదృష్టమో ఏమో రెండూ అడవిలోకి దూసుకుపోయాయి. ఇంకా ఆగితే ప్రమాదం తెచ్చుకొన్నట్లు అవుతుందేమోనని నేను జీపు పోనిమ్మని నా మిత్రునికి చెప్పాను. అదే చాలన్నట్లు అతను 'స్టార్టు' చేసి వేగంగా పోనిచ్చాడు"

గాఢంగా నిట్టూర్చి చంద్రం అన్నాడు. ఆ పరిస్థితిలో అవి తిరగబడి నట్లయితే ఏం చేసేవారు?"

"చేసేదేముంది దైవంమీద భారం వెయటం తప్ప?" అని నవ్వాడు నాగభూషణం.

"అన్నట్లు ఈ గొడవలో నేనుమరచేపోయాను. మనం బయలుదేరవద్దూ?" అని లేచాడు నాగభూషణం.

"ఈసారయినా తూటాలు ఉన్నవోలేవో చూశారా" నవ్వింది తార.

"ఒటి రెండుసార్లు చూశాను. అంతారెడీ. నేనూ, రాంసింగూ ముందుదారి తీసాము. మీరు మా వెనుక నేరండి. జాగ్రత! అంతా రెడీయేగా?" ముగురూ లేచారు. అవతల జీపులదగ్గర రాంసింగ్ ఎదురు చూస్తున్నాడు. వీళ్ళ కోసరం.

♦ ♦ ♦

జీపులు రెండూ బయలుదేరాయి. నాగభూషణం, రాంసింగూ, ముందు జీపులో యెక్కారు. చంద్రం, తారా యిద్దరూ రెండోదాన్లో కూర్చున్నారు. రెండు జీపులూ కొండదిగి లోయలోనికి ప్రవేశించాయి. ఓ పావుగంట తరవాత ముందు జీపు వేగంగా దూసుకుని పోతున్నది అడవిక.

"వేగంగా పోనివ్వండి" హెచ్చరించింది తార. నవ్వాడు చంద్రం.

"ఈ లోయల్లో ముందూ వెనకా చూడకుండాపోతే ప్రమాదం తారా?" "అది సరేగా, ఈ రాత్రి నువ్వు యెంత అందంగాఉన్నావు తారా!"

"నేనేనా? ఈ రాత్రి కూడానా?" నవ్వింది తార.

"రెండూనూ... కాదు అంతానూ" ఆమె భుజం వెనుకగా చెయ్యి పోనిచ్చాడు చంద్రం.

"మత్తెక్కిన కళ్ళకి అంతా అలాగే ఉంటుంది" అంది తార అతని చేతిని తొలగిస్తూ.

"బాగా అన్నావు. అది సరేగాని ఇన్నాళ్ళూ నన్నొదిలి యెలా ఉండగలిగావు తారా? అసలు ఈ రాత్రి ఇక్కడికి రావటానికి ఎందుకొప్పుకున్నావో తెలుసా? నీ కోసమే."

తార నవ్వింది. ఆ నవ్వుకి అర్థాలు అనేకం.

"నాగభూషణంతో ఎలా వున్నావు ఇన్నాళ్లూ? నువ్వు యిన్నాళ్లూ నా మనస్సంతా ఆక్రమించి నన్ను పిచ్చివాణ్ని చేస్తున్నావు" తార నిశ్చలంగా వెన్నెల్లోకి చూస్తోంది.

"నువ్వు నాకు దక్కనందుకు విరక్తి చెందాను మొదట్లో, కొన్నాళ్ళు పిచ్చిగా తిరిగాను. ఏదో యాంత్రికంగా బలవంతంగా చదువు పూర్తిచేసి ఉద్యోగంలో చేరాను. అదృష్టం కలిసివచ్చి ఈ నాటికి పెద్దఆఫీసరునయ్యాను. ఇప్పటికి నాకు పెళ్ళి చేసుకోవాలని యెవరితోనో సంసారం చెయ్యాలనీ ఆశ లేదు. కారణం ఏమిటో నీకు తెలుసుగదా! నా వుద్యోగం సంపాదన, హోదా ... ఎవరి కోసం? ఎవరిని ఆనందింప చేయటానికి? ఆలోచిస్తే నాకు పిచ్చెక్కుతుంది. ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. నాగభూషణం ఆర్థిక పరిస్థితులు నీకు తెలుసా? వ్యాపార విషయాలు నీతో మాట్లాడు

తాడా? మీా యిద్దరూ అన్యోన్యంగా వుంటారా?" వుద్వేగంగా తారవంక చూశాడు చంద్రం.

తల అడ్డంగా వూపింది తార.

"నాకు తెలుసు తారా? నువ్వు సుఖపడటం లేదు. నాగభూషణం బాగా మారిపోయాడు ఈ మధ్య. అతనికి మన సంగతి తెలిసింది. అతడు నిన్ను సరిగా చూడటంలేదు. నీ పెదిమలపై మెరిసే హాసానికి మనస్సులో పునాదిలేదు. నువ్వు దుఃఖాన్నీ, అశాంతినీ కప్పెట్టడానికి సంతోషాన్నీ, ఉల్లాసాన్ని నటిస్తున్నావు. నీ హృదయంలో అగ్ని గోళాలు రగులుతున్నాయి. నాగభూషణం అనుమానపుకళ్లు నిన్ను పరీక్షిస్తున్నాయి. అస్తమానూ అతను రోజూ నిన్ను వేటాడుతున్నాడు చాటుగా. ఇందాక నిన్ను నా జీపులో రమ్మని చెప్పడంలో ఆంతర్యమేమిటి? ఇప్పుడు తను రాంసింగ్ జీపులో కూర్చోవడమెందుకు? అతను తన ఇద్దర్నీ పరీక్షిస్తున్నాడు తారా! దాని పర్యవసానమేమిటో నాకు తెలియటం లేదు.

"నీ మనస్సు సున్నితమయినది. నువ్వు ఈ బాధ భరించలేవు. నాతో వచ్చేసెయ్యి తారా? అతనినుండి నేను నిన్ను కాపాడతాను. నా మనస్సనే పువ్వుల్లో నిన్ను పూజిస్తాను." చంద్రం జీపుఆపి తారవంక చూశాడు వెన్నెల్లో మెరిసిన బుగ్గలమీాద కన్నీరుచూసి అదిరిపడ్డా చంద్రం. ఆమె కన్నీటిని కొనగోటితో తుడిచి బుజ్జగించాడు. ఆమెను మృదువుగా కౌగలించుకోబోయాడు తార అతని చేతుల్ని దూరంగా తోసి జీపు పోనిమ్మన్నట్టు సైగ చేసింది.

"ముందు ఈసంగతి చెప్పు తారా! నువ్వు అతని బాధని భరించలేవు. నేను చూడలేను. నాగభూషణం పైకి కనిపించేటంత సౌమ్యుడు కాడని నీకు తెలుసు. అతనితో జరిగిన నీ రిజిష్టర్ మ్యారేజ గడువు పూర్తయిందన్నావుగా మొన్నటితో? ఇంక అతనినుండి వచ్చేయటానికి పెద్ద ప్రతిబంధకం ఏమీలేదు. పైగా అతని ఆర్థికపరిస్థితులు ఇప్పుడు బాగా చెడిపోయాయి. ఈమధ్య చేపట్టిన నాలుగు పెద్ద కంట్రాక్టులూ అతనికి నష్టం తెచ్చిపెట్టాయి. ఇప్పుడు ఈరాత్రి అతను నాకు ఇచ్చిన డిన్నర్ యెందుకో నేను వూహించలేకుండా ఉన్నాను. ఏమయినా నాగభూషణం చిత్రమయిన మనిషి.

"నన్ను త్రోసి రాజని నాగభూషణాన్ని వివాహం చేసుకున్నానని నేను బాధపడటంలేదు తారా? నీమీద కోపంకూడా లేదు. నీమీద నా ప్రేమ అచంచలమయింది. దానికి తిరుగులేదు. నాకు తెలుసు. పదేళ్ళక్రితం నీమనస్సు స్థిరంలేకుండా పరుగులుతీసేది. మంచీచెడూ తెలియచెప్పటానికి వెనక ఎవరూ లేరు. నీ కాలేజీచదువు పూర్తవటమూ ఒక్కగానొక్క ప్రేమమయుడైన నీతండ్రి అప్పుడే మరణించటమూ, తొందరపాటువలన నువ్వు నన్నుకాదని నాగభూషణాన్ని వివాహం చేసుకోవటం అంతా దైవికం. అప్పటి నీ మనస్సు కొండలలో ఎగిరెగిరిపడే నదిలాంటిది. ఈ పదేళ్ళలోనూ జీవితంలో ఆటూ పోటూ తగిలి నీ మనస్సుకొక్క

నిశ్చలత ఏర్పడింది. నాగభూషణం నీ శరీరాన్ని వాంఛించాడు. నీ హృదయం అతనికి అవసరం లేదు. నాకు నీమనస్సు కావాలి. నామనస్సు ఎప్పుడో నీకిచ్చేశాను. ఇకనయినా నా దగ్గిరికి వచ్చేసి నాకు శాంతిని ప్రసాదించు తారా! ఆత్మీయతా, అనురాగమూ లేని సంసారం అగ్నిగుండంతో సమానంసుమా" ఆ వేదనతో చంద్రానికి కన్నీరు జలజలా రాలింది. జీపు జంక్షన్ దగ్గిరికివచ్చి ఆగింది, అక్కణ్ణించి మూడుదారులు చీలాయి. ఒకటి పట్టణానికి, రెండవది ఇంకొక దారిని ఇందాక బయలుదేరిన బంగళాకీ, మూడోవది క్రింది లోయలోనికి వెడతాయి. యేదో ఒకటి తేల్చుకోవాలనే నిశ్చయంలో ఉన్నాడతను. "ఇందాకటినుంచీ ఒక్కడినే మాట్లాడుతున్నాను: నా మనసులోవున్న సంగతి నీకు వివరించాను. ఇప్పుడు నేను నిర్ణయించుకున్నాను తారా! నువ్వు లేనిదే నేను బ్రతకలేను. నీ అంగీకారమో అనంగీకారమో ఇప్పుడు చెప్పాలి. ఆశ నన్ను వదిలిపోలేదు. లేకపోతే ఇదిచూడు" అని జేబులోంచి ఎర్రకాగితపు పొట్లం బయటకుతీశాడు చంద్రం.

"ఇది సైనైడు, రెండు నిముషాలు చాలు" కంగారుగా అతని చేతుల్లోంచి ఆ పొట్లాం లాక్కొనటానికి ప్రయత్నించిందితార. "ఇప్పుడే అంతప్రమాదం తలపెట్టనులే. రేపు తెలుస్తుంది నీకు దీని ఫలితం" పొట్లాన్ని జేబులోపెట్టాడు చంద్రం పిచ్చిగా నవ్వుతూ.

"నీ మవునం నన్ను వేధిస్తున్నది తారా! నామాట

లకు అంగీకరించావా ? ఇంతకాలంనుంచి నేను చేసిన తపస్సు నా నిరీక్షణ ఫలించాయనుకోవా ? నువ్వు ఒప్పుకున్నట్లేగదా! నీ మౌనాన్ని అంగీకారంగా తీసుకోవా ? ఇప్పుడే జీపుని సరాసరి పట్టణాన్ని మనఇంటికి పోనిస్తున్నాను. నీనిర్ణయం తెలియచెయ్యి," తారవైపుచూశాడు చంద్రం. ఆమె ఆలోచిస్తూ అలాగే కూర్చున్నది. అతను వంగి ఆమెపెదవులను మృదువుగా ముద్దుపెట్టుకొన్నాడు. ఆమె అతనినుండి తప్పించుకొనడానికి ప్రయత్నించలేదు. కాని ఆమెశరీరం ఒక్కక్షణంపాటు ఉలిక్కిపడటం అతడు పసిగట్టాడు. కారణం తెలుసుకోటానికి అతను ఆసక్తి చూపలేదు.

ఇప్పుడు తిన్నగా మనయింటికి వెడుతున్నాము! ఏమయినా మాట్లాడవలసివస్తే నాగభూషణంతో నేను మాట్లాడి సరిచేస్తాను. సరేనా ?" జీపు వేగంగా బయలుదేరింది వెన్నెలను దూసుకుంటూ.

ఇప్పుడు చంద్రం ఒకచెయ్యి ఆమె భుజాల వెనుకగా వేసి కారు నడుపుతున్నాడు. చలిగాలి చెవుల్ని దూసుకుపోతోంది. ముందు వెడుతున్న జీపు అడవిలో కనబడకుండాపోయి ముప్పావుగంటయింది. వేటని దక్కించుకొని ఉత్సాహంతో ఉరకలు పెడుతున్న వేటగానిలా ఉల్లాసంగా సిగరెట్టు కాలుస్తున్నాడు చంద్రం.

* * *

అకస్మాత్తుగా జీపు కొండయెక్కి బాటచివరి వరకు వచ్చి ఆగిపోయింది. దిగిచూస్తే అది బంగళా. భోజనాలు

చేసి ఎక్కణ్ణించి అయితే బయలుదేరారో అదే బంగళాకు తిరిగివచ్చారన్నమాట." దారితప్పి తిరిగి బయలుదేరిన చోటికే వచ్చాము. వాళ్ళజీపు ఇంకా వచ్చివుండదు. లోపల నీ సామానేమయినావుందా? నాక్కోటు మరచిపోయాను. తీసుకునివస్తాను. జస్ట్ ఒక్కనిమిషం" అని బంగాళాకేసి నడిచాడు చంద్రం.

వరండాలో నౌకర్లు నిదురపోతున్నారు హాలులో దీపాలు వెలుగుతున్నాయి. నాగభూషణం కూర్చుని తుపాకీని శుభ్రంగా తుడుస్తున్నాడు తాపీగా తలవంచుకుని.

చంద్రానికి ఆశ్చర్యం వేసింది. "అరె! మీరెప్పుడు వచ్చారు? రాంసింగ్ ఏడీ?" ఎదురుగా కూర్చుంటూ అడిగాడు. "వచ్చారా? వస్తారని నాకు తెలుసుననుకో. అతన్ని పనిమీాద పంపించానులే. ఈలోగా మనం మాటలు పూర్తి చేసుకోవచ్చును, తార ఏదీ? జీపులోవుందా? గుడ్! నీ వోవర్ కోటు ఇదిగో. తీసుకుని అట్టా కూర్చో చంద్రం" నాగభూషణంకళ్ళు ఎర్రగా జ్యోతుల్లా మెరుస్తున్నాయి.

మేమెలా వచ్చామంటే అడ్డుదారిని. ఎందుకో వచ్చేదామనిపించింది. అంతే!" "మేము వెళ్ళాము. ఇప్పుడు నీ మనస్సు సరిగాలేదు. తరువాత మాట్లాడుకోవచ్చును" చంద్రం లేవబోయాడు.

"కాదు కాదు నేను సరిగానే ఉన్నాను. మనం మాట్లాడుకోవటానికి ఇదే మంచి సమయం. తారను గురించనుకుంటున్నావా? పిచ్చివాడా! ఆసంగతి నేను ఎప్పుడో

తేల్చేశాను. ఆ విషయంలో నానుంచి నీకు యే బాధావుండదు మనం మనుష్యుల్ని కట్టేయగలం కాని మారేమనసుల్ని బంధించగలమా?" చంద్రంమనస్సు ఆశ్చర్యంతో నిండి పోయింది. అతను ఇంత తేలికగా మాట్లాడతాడనుకోలేదు.

"తారవిషయం తెలిసే మాట్లాడుతున్నావా? నాగ భూషణం" ఆశ్చర్యంగా అడిగాడు చంద్రం.

"పిచ్చివాడా! నాకు అన్నీ తెలుసు. తాడును తెగే దాకా లాగే స్వభావంకాదు నాది. నేను తారగురించి బాధ పడటంలేదు. ఇప్పుడు నీతో కావలసినపని నాకు ఒకటుంది. అది అయితే ఇక మీ మార్గం నిష్కంటకమే ననుకో వచ్చును."

"నాతో కావల్సినపనా?" ఆశ్చర్యం ప్రకటించాడు చంద్రం.

"తిన్నగా అసలువిషయమే మాట్లాడుదాము. అవును. నీతో నేకావాలి. ప్రస్తుతం నాసంగతి నీకు తెలుసు. ఆర్థికంగా బాగా చితికిపోయాను. కంట్రాక్టుల్లో బాగా పడిపోయాను. ఇప్పుడు నువ్వు చేయూత నిస్తేనేగాని నిలద్రొక్కుకొనలేదు. లేకపోతే నాపని బజారునపడటమే అవుతుంది. ముఖ్యులైన ఇద్దరు మార్వాడీ అప్పులవాళ్ళు 'డిక్రీ' తెచ్చారు నామీద రెండురోజులక్రితం. ఇప్పుడు ఒక లక్షరూపాయలకి నువ్వు సాయంచేశావా నేను ఒడ్డునపడతాను. ఇవాళ మనం ఇక్కడ కలవటంలో ముఖ్యోద్దేశం యిదే."

"లక్షరూపాయలా? నేనా? యెక్కణ్నించి తెచ్చి

యివ్వగలను? ఎట్లా?" చంద్రం భయంతో వణికిపోతు న్నాను.

"ఎట్లాగంటావా? అది నేను చెబుతాను. నువ్వు కష్ట పడక్కరలేదు. పిచ్చివాడా? అంత భయపడతావు దేనికి? చాలా సులభమయిన విషయమిది!"

నాగభూషణం వంగి బాగ్‌లోంచి కొన్ని కాగితాలు బయటికి తీశాడు,

"ప్రస్తుతం ఈ అడివంతా నీ అధికారంక్రింద ఉంది. వచ్చి తనిఖీచేసి నిన్ను ప్రశ్నించేవాళ్ళు లేదు. ఇరవైవేల టన్నులకలప కొట్టి లాట్లు కట్టించినపనికి సంబంధించిన అగ్రి మెంట్లుకి సంబంధించిన కాగితాలు ఇవి. వీటిమీద నీ సంతకం పడిందా, ఒకవారంరోజులలో బిల్లుచేయించుకుని ఈగండం నుంచి పయటపడతాను.'

"ఆండర్లు పిలవలేదు. అసలు పని జరగందే. పైగా ఆ కలప వేలంవేయటం ఇదంతా ఎలా సరిపెట్టడం? నాకంతా అయోమయంగా ఉంది. అదీగాక ఈమధ్యన సి ఐ. డీ...!" అన్నాడు చంద్రం నిబ్బరంగా.

"పిచ్చివేషాలు వేయకు చంద్రం. ఇదిగో ఇదిచూశా వుగా ఎలా మెరుస్తుందో. నిండుప్రాణాల్ని నిముషాల్లో తీసే యలేను...నువ్వు ఇటువంటివి ఇదివరకు ఎన్నోసార్లు సరి పెట్టావు. ఆసంగతి నీకు తెలుసు. ఆ కలపలాట్లన్నీ మొన్నటి వరదల్లో కొట్టుకుపోయాయని రిపోర్టుపంపటం నీకంత కష్ట మయినపని కాదని నాకు తెలుసు,"

"కాని..." చంద్రం మాట్లాడబోయాడు.

"ఇక నేను నీనుంచి ఏమీ వినదలుచుకోనలేదు. నా సంగతి నీకు తెలుసుగా. నేనసలే మొండివాడిని. తొందరగా పనికానీ. అవతల తార నీకోసం ఎదురుచూస్తోంది."

"నేనూ అతిగా నిన్ను విసిగించదలుచుకోలేదు. కాని ఒక్కసారి ఈ కాగితం చూడు, తరవాత ఏంచెయ్యమన్నా చేస్తాను." చంద్రం జేబులోంచి వెతికి కాగితంఒకటి బయటికి తీసి నాగభూషణానికిచ్చాడు.

అది చదువుతున్నంతసేపూ నాగభూషణం ముఖంలో రంగులు మారాయి. అతని మొహం వికృతంగా మారటం మొదలెట్టింది. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు భారంగా వస్తున్నాయి.

"ఎప్పుడు వచ్చారు మీరు?" పలకరించింది అప్పుడే వచ్చిన తార. ఆమె వచ్చినసంగతి యెవరూ గమనించలేదు ఈగొడవలోపడి.

"ఇంతకీ నువ్వు చెప్పదల్చుకున్నది నీ సంతకానికి ఇప్పుడు విలువలేదని అన్నమాట. అయితే... నువ్వు ఇప్పుడు సస్పెన్షన్‌లో ఉన్నావా? సుందరసింగ్ కంట్రాక్టు కేసులో! అయిపోయింది అంతా అయిపోయింది! అయితే యిక మిగిలింది ఒక్కటే..." అనిలేచి నాలుగడుగులు వెనక్కి నడిచాడు నాగభూషణం తుపాకీ పట్టుకుని నిశ్శబ్దంగా.

చంద్రం వణికిపోతున్నాడు లేచి నిలబడి. మృత్యువు యింకెంతో దూరంలో లేదు తనకి.

నిరాయుధుణ్ణి కేసి చంపేసేయటం ధర్మంకాదు," ఏడుస్తూ అరిచింది తార.

"ష్...ష్. అవతల నౌకరుగాళ్ళు వొస్తారు. రెండు నిమిషాలే. నీ అష్ట దేవతని తలుచుకో చంద్రంముందు నువ్వు నేను నీ వెనక్కాలే వస్తున్నాను. భయపడకు:" గర్జించాడు నాగభూషణం.

బయట ఆకాశంలో చంద్రుణ్ని మేఘాలు కప్పాయి. వెన్నెల మసకగా తెల్లబోయింది.

తుపాకీయెత్తి గురిచూసిన నాగభూషణానికి చంద్రాన్ని అడ్డంగా అనుకుని నిలబడి తీక్షణంగా చూస్తూ మరణానికి సిద్ధంగాఉన్న తార కనిపించింది. ఒకనిమిషం అలానే నిలబడి తుపాకీ దించివేశాడు, పసుకుగా జుగుప్సగా నాఅభూషణం

"ఛీ! పొండి అవతలకి" అన్న గర్జనవిని ద్వారంవేపు పరుగులు పెట్టాడు చంద్రం తారతో అదే చాలన్నట్టు. ద్వారం దాటుతూండగా ప్రేలుడువిని ఇద్దరూ వులిక్కిపడి వణికి పోయారు. అప్పుడే ఎదురుగావస్తున్న రాంసింగ్ "క్యాసాబ్" అంటూ లోపల ప్రవేశించాడు.

నాగభూషణం క్రింద పడిఉన్నాడు. అతని నుదుటి నుంచి నెత్తురు ధారగా ప్రవహిస్తోంది. "సాబ్! సాబ్" అని పలకరించిన రాంసింగ్ సమాధానం చెప్పటానికి నాగభూషణం లేడు. కాంతా, కనకాలు రెండూ పోగొట్టుకున్న నాగభూషణం ప్రాణాలుకూడా కావాలని వదిలేశాడు.